# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 01-06-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **దేశంలో తీవ్ర ఎండలు, వడగాలుల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచించారు.**

2. **ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లాలో నిర్వహించే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పాల్గొంటారు.**

3. **తెలంగాణలో విద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు.**

4. **ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటైన దక్షిణ కోస్తా రైల్వే జోన్ అధికారిక కార్యకలాపాలు ఈరోజు నుంచి ప్రారంభమవుతాయి.**

==========================

దేశంలోని పలు ప్రాంతాల్లో తీవ్ర ఎండలు, వడగాలుల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచించారు. ఆకాశవాణి ద్వారా ప్రసారమైన "మన్ కీ బాత్ " మనసులోని మాట కార్యక్రమం 134వ సంచికలో ప్రధానమంత్రి పలు అంశాలపై ప్రసంగించారు. దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా రోజంతా తగినంత నీరు తాగడం, అవసరం లేని సందర్భాల్లో ఎండలో బయటకు వెళ్లకుండా ఉండడం, శరీరాన్ని చల్లగా ఉంచే ఆహార పదార్థాలు, పానీయాలు తీసుకోవడం అవసరమని ప్రధాని పేర్కొంటూ,

వాయిస్ ..30..సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా తుని మండలం చామవరంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పర్యటిస్తారు. ఈ సందర్భంగా ప్రజావేదికలో స్థానిక ప్రజలతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకోనున్నారు. మధ్యాహ్నం ఎన్టీఆర్ భరోసా పింఛను లబ్ధిదారుల ఇళ్లను సందర్శించి, వారితో మాట్లాడి పింఛన్లను పంపిణీ చేయనున్నారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలు, స్థానిక రాజకీయ పరిస్థితులపై పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం కానున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు.

---

తెలంగాణలో విద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు. కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన పర్‌ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో తెలంగాణ పనితీరు మెరుగుపడటం ప్రభుత్వ కృషికి నిదర్శనమని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన నిన్న పేర్కొన్నారు. భవిష్యత్తులో యంగ్ ఇండియాసమీకృత పాఠశాలలు అందుబాటులోకి వచ్చిన తర్వాత తెలంగాణ విద్యా వ్యవస్థ దేశంలోనే అగ్రస్థానంలో నిలుస్తుందని చెప్పారు. గత రెండేళ్లలో విద్యారంగంలో పలు సంస్కరణలు అమలు చేశామని, మోడల్ స్కూళ్ల ఏర్పాటు, ఉపాధ్యాయుల నియామకాలు, డిజిటల్ విద్య ప్రోత్సాహం, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన వంటి చర్యలు చేపట్టామని వెల్లడించారు.

---

పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హామీ ఇచ్చారు. నెల్లూరులో పొగాకు రైతులు మంత్రిని కలసి తమ సమస్యలను నిన్న వివరించారు. గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సంబంధిత మంత్రులు, జిల్లా అధికారులతో ఫోన్‌లో చర్చించారు. రైతుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేస్తూ..

వాయిస్..30.. సెకన్లు

---

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటైన దక్షిణ కోస్తా రైల్వే జోన్ అధికారిక కార్యకలాపాలు ఈరోజు నుంచి ప్రారంభించనుంది. దక్షిణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ జోన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ జోన్ పరిధిలో విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్లతో పాటు వాల్తేరు డివిజన్‌ను విభజించి కొత్తగా ఏర్పాటు చేసిన విశాఖపట్నం డివిజన్ కూడా ఉన్నాయి. రైల్వే జోన్ పరిధిలో మొత్తం 3 వేల 501 కిలోమీటర్ల పొడవైన రైల్వే మార్గం ఉంది. నాలుగు డివిజన్లలో 385 రైల్వే స్టేషన్లు ఉండగా, సుమారు 17 వేల మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు.

---

విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కానుండటంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎక్స్ వేదికగా స్పందిస్తూ, దక్షిణ కోస్తా రైల్వే జోన్ అధికారికంగా ప్రారంభం కావడం చారిత్రాత్మక మైలురాయి అని పేర్కొన్నారు. నూతన రైల్వే జోన్ ఉత్తరాంధ్ర రవాణా ముఖచిత్రాన్ని సమూలంగా మార్చడంతో పాటు కొత్త ఉపాధి అవకాశాలకు, పారిశ్రామిక వృద్ధికి బాటలు వేస్తుందని తెలిపారు. అలాగే రైల్వే జోన్ ఏర్పాటుపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం నెరవేరిందని ఆయన పేర్కొన్నారు.

---

శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. విశాఖపట్నం లంకెలపాలెం సమీపంలో విధి నిర్వహణలో ఉండగా కత్తి దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హోం గార్డ్ ను మంత్రి నిన్న పరామర్శించారు. ఘటనకు సంబంధించి

నిందితులను ఇప్పటికే అరెస్టు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో పోలీసు సిబ్బంది భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, దాడులకు పాల్పడేవారి పై కఠిన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి హైదరాబాద్‌లోని బంజారా హిల్స్ పరిధిలోని మిథిలా నగర్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక నివాసితులతో ఆయన ముచ్చటించి, సమాజ శ్రేయస్సు, ప్రజారోగ్యం, ఫిట్‌నెస్ కార్యక్రమాల ప్రాధాన్యాన్ని వివరించారు. ఓపెన్ జిమ్‌ల వంటి ప్రజా సౌకర్యాలు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడతాయని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఇటువంటి సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ప్రజలు వ్యాయామాన్ని తమ జీవనశైలిలో భాగం చేసుకోవాలని సూచించారు.

---------------------------

ఐపీఎల్-2026లో భాగంగా అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియం వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య నిన్న జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బెంగళూరు జట్టు విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. అనంతరం 156 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన బెంగళూరు జట్టు 18 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 161 పరుగులు చేసి గెలుపొందింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు, ఎండ ప్రభావంతో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. రాయలసీమ జిల్లాల్లో ఈరోజు పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఇక పోలవరం, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, మార్కాపురం, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 42 నుండి 44 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదైయ్యే అవకాశం ఉందని తెలిపింది.

తెలంగాణలోనూ విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఈరోజు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పసుపు రంగు హెచ్చరికలు జారీ చేసింది. అలాగే రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఎండల తీవ్రత కొనసాగుతుందని పేర్కొంది.

=====================